## క్లుప్తంగా

### కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో..టమాట 20, పచ్చిమిర్చి 50 , బెండ 40, కాకర 40, దొండ 30, దోస 30, ఆలు 25, చామ 50, కీర 35, బీర 40, వంకాయ 30, గోకర 40, బీన్స్ 70, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 25, క్యారెట్ 50, చిక్కుడు 60, ఉల్లి 30 (1 కేజీ), ములక్కాయలు (2) 10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 180, వెల్లుల్లి 180.

### 16న 'ఎంపవరింగ్ ది ఫ్యామిలీ' ముగింపు

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థలోని విమెన్స్ వింగ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన 'ఎంపవరింగ్ ది ఫ్యామిలీ' కార్యక్రమం ముగింపు కార్యక్రమాన్ని ఈనెల 16వ తేదీన ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు గచ్చిబౌలి శాంతిసరోవర్‌లోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఉపన్యాస, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040–23001234లో సంప్రదించవచ్చు.

### పున్నారావుకు 'మ్యాన్ ఆఫ్ ద మంత్' అవార్డు



అవార్డు అందుకుంటున్న లింగంపల్లి రైల్వే స్టేషన్ డిప్యూటీ స్టేషన్‌మాస్టర్ పున్నారావు

శేరిలింగంపల్లి: దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ మ్యాన్ ఆఫ్ ద మంత్ అవార్డును లింగంపల్లి రైల్వే స్టేషన్ డిప్యూటీ స్టేషన్ మాస్టర్ టి.పున్నారావు దక్కించుకున్నారు. ఈ మేరకు మంగళవారం జరిగిన కార్యక్రమంలో సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ ఆఫీస్‌లో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందజేశారు. విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి అందజేస్తారు. ఈ సందర్భంగా పున్నారావును లింగంపల్లి స్టేషన్‌లో ఉద్యోగులు, అధికారులు అభినందించారు.

### టెడెక్స్ హైదరాబాద్ 17న...

సాక్షి, సిటీబ్యూరో: విజయవంతమైన వ్యక్తుల ప్రసంగాల వేదిక టెడెక్స్ హైదరాబాద్ నగరంలో తమ 9వ ఎడిషన్‌ను ఈ నెల17 నిర్వహించనుంది. ఈ సందర్భంగా నగరంలో గచ్చిబౌలిలో ఉన్న ప్రధాన్ కన్వెన్షన్స్‌లో నిర్వహించే కార్యక్రమంలో ప్రసంగించనున్న 12 మంది భిన్నరంగాలకు చెందిన విజయవంతమైన వ్యక్తుల జాబితాను శనివారం విడుదల చేసింది. వీరిలో నగరానికి చెందిన సస్టెయినబుల్ ఛాంపియన్ కల్పనా రమేష్, పిన్న వయసు పర్వతారోహకురాలు మలావత్ పూర్ణ, నెఫ్రోప్లస్ వ్యవస్థాపకుడు కమల్‌షా...తదితరులు ఉన్నారు.

### మురుగు సమస్య పరిష్కరించండి



రోడ్డుపై నిలిచిన మురుగును పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ నవతారెడ్డి

మియాపూర్ : కాలనీ, బస్తీలలో పలురకాల సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే పట్టించుకునే నాథుడే కరువయ్యారని మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి పేర్కొన్నారు.చందానగర్ డివిజన్ పరిధిలోని న్యూపీఏనగర్ బస్తీలో కాలనీవాసులతో కలిసి అక్కడి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గత కొన్ని రోజులుగా పీఏనగర్ బస్తీలో మురుగునీరు రోడ్డుపై ప్రవహించడంతో బాటు దుర్వాసనను స్థానికులు భరించలేకపోతున్నారన్నారు. అసలే దోమలు ప్రబలుతున్న నేపథ్యంలో జ్వరాలు వ్యాపించే ప్రమాదముందన్నారు. అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరారు. బస్తీవాసులు గోపి, శేఖర్, రత్నం, నాగేశ్వర్‌రావు,శ్రావణి, జ్యోతి తదితరులున్నారు.

### క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ పాల్గొనాలి

రాయదుర్గం: విద్యార్థులు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా పాల్గొనాలని ఉర్దూ విశ్వవిద్యాలయ స్టూడెంట్స్ వెల్ఫేర్ చైర్మన్, స్టూడెంట్స్ ఇండక్షన్ ప్రోగ్రామ్ డిప్యూటీ డీన్ డాక్టర్ కేఎం.జియావుద్దీన్ అన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో దీక్షారమ్ ముగింపు కార్యక్రమం సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరగతి గదుల్లో చదవడం, నేర్చుకోవడంతో పాటు అన్ని రంగాలలో కూడా రాణించేలా ప్రయత్నించాలన్నారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ డైరెక్టరేట్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కలీముల్లా మాట్లాడారు. కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఫిర్దౌస్ తబుసుమ్, స్పోర్ట్స్ కమిటీ సభ్యులు హబీబ్ అహ్మద్, మ్యూజియం క్యూరేటర్ అమీర్‌బదర్ క్రీడాకారులు, విద్యార్థులు, కోచ్‌లు పాల్గొన్నారు.

# ఫస్టియర్ ఫుల్‌ఫిల్ ప్రభుత్వ కాలేజీలో భారీగా అడ్మిషన్లు

- మొదటి సంవత్సరం 515 మంది చేరిక
- కంప్యూటర్ సైన్స్ ఒకేషనల్ కోర్సుకు డిమాండ్



మధురానగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్ మధురానగర్‌లోని రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రస్తుత విద్యాసంవత్సరంలో అడ్మిషన్ల సంఖ్య పెరగడం విశేషం. ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతానికి చేరువలోని ఈ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఒకేషనల్ కోర్సులో విద్యార్థులు ఎక్కువగా చేరారు. పేద, మధ్య తరగతివారికి ఇంటర్మీడియట్ విద్యను ఉచితంగా అందించాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతోంది. కాగా కళాశాలలో ప్రస్తుతం 10 తరగతి గదులు ఉండగా మరో ఆరు తరగతి గదులు అవసరమని సిబ్బంది పేర్కొంటున్నారు. ఒక్కో తరగతి గదిలో 150 నుంచి 160 మంది వరకు కొనసాగించాల్సిన పరిస్థితి నెలకొంది.

- ఇప్పటి వరకు కళాశాలలో ఫస్ట్ ఇయర్‌లో 515 మంది చేరారు.
- అందులో 115 మంది కంప్యూటర్ సైన్స్ ఒకేషనల్ కోర్సులో చేరారు.
- సెకండ్ ఇయర్‌లో 388 మంది కొనసాగుతున్నారు. మొత్తం కళాశాలలో విద్యార్థుల సంఖ్య 903కు చేరింది.
- గత ఏడాది కొత్తగా 370 మంది విద్యార్థులు చేరగా ఈసారి 145 మంది ఎక్కువగా చేరారు

**కళాశాలలోని కోర్సులు ఇవే..**

- రాయదుర్గంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీఈసీ, ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో తెలుగు, ఇంగ్లిష్ మీడియం రెండూ నిర్వహిస్తున్నారు.
- ఐటీకారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు చేరువలోని మధురానగర్‌లో కొనసాగుతున్న రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కంప్యూటర్‌సైన్స్ ఒకేషనల్ కోర్సును నిర్వహించడం విశేషం.
- ఈ కోర్సుతో ఉద్యోగ అవకాశాలు లభిస్తుండడంతో డిమాండ్ పెరిగింది.
- కొత్తగా కళాశాలలో చేరే విద్యార్థులకు ఉచితంగా టెక్స్ట్‌బుక్‌లు అందిస్తారు
- ఎస్సీ,ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఉపకార వేతనాలను అందిస్తారు
- అర్హులైన వారందరికీ బస్‌పాస్ సౌకర్యం ఉంటుంది.
- లైబ్రరీ, ల్యాబ్ సౌకర్యం అందుబాటులోకి తీసుకొచ్చారు.

**మౌలిక వసతుల కల్పనకు చర్యలు**



ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నాం. విద్యార్థులకు ప్రభుత్వం ద్వారానే కాకుండా దాతల సహకారంతో కూడా మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నాం. ఏటేటా విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఒకప్పుడు 50 మందితో కొనసాగిన కళాశాలలో ఇప్పుడు ఈ ఏడాది ఫస్ట్ ఇయర్‌లో 515 మంది చేరారు ఈసారి కంప్యూటర్ కోర్సు ఒకేషనల్ కోర్సులో ఏకంగా 115 మంది చేరడం విశేషం.

–శ్రీనివాసులు, ప్రిన్సిపల్, రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాల

# బీఆర్ఎస్ విజయం తథ్యం

- శేరిలింగంపల్లిలో భారీ మెజార్టీతో గులాబీజెండా ఎగురవేస్తాం
- శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ
- రాయదుర్గంలో పాదయాత్ర



రాయదుర్గంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

రాయదుర్గం: రాష్ట్రంలో మళ్ళీ బీఆర్ఎస్ పార్టీదే హ్యాట్రిక్ విజయం అని ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం గచ్చిబౌలి డివిజన్‌లోని రాయదుర్గంలో మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టిసాయిబాబా, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లిలో భారీ మెజార్టీతో గెలిచి గులాబీ జెండా ఎగురవేస్తామని స్పష్టం చేశారు. గత తొమ్మిదిన్నరేళ్ళుగా శేరిలింగంపల్లిలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేశామని, భవిష్యత్తులోనూ చేస్తామని స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో శేరిలింగంపల్లి చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా కోట్లాది రూపాయల వ్యయంతో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టామన్నారు. నియోజకవర్గంలో సంతులిత, సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామన్నారు. దశల వారిగా అభివృద్ధి పనులను చేపడుతామని, అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు త్వరలోనే పూర్తి చేస్తామన్నారు

**హుస్సేన్ షావాలీదర్గాలో చద్దర్ సమర్పణ**

రాయదుర్గంలోని హజ్రత్ సయ్యద్ ఖాజాహుస్సేన్ షావాలీ దర్గాలో ఎమ్మెల్యే గాంధీ, నాయకులు, అధికారులతో కలిసి చద్దర్ సమర్పించారు. అనంతరం ప్రార్థనలు చేశారు. రాయదుర్గంలోని పలు బస్తీలలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఈఈ శ్రీనివాస్, డీఈ విశాలాక్షి, ఏఈ జగదీష్, వాటర్‌వర్క్స్ మేనేజర్ నరేందర్, ఎలక్ట్రికల్ ఏఈ షణ్ముఖరెడ్డి, డీఈ మల్లికార్జున్, ఏఈ రాజశేఖర్, ఏఎంఓహెచ్ నగేష్‌నాయక్, శానిటేషన్ సూపర్‌వైజర్ జలంధర్ రెడ్డి, టీపీఎస్ రమేష్, నాయకులు గణేష్ ముదిరాజ్, శ్రీనివాస్‌యాదవ్, హబీబ్ పాల్గొన్నారు.

# ఓటరు నమోదుపై అవగాహన

ఐటీ సంస్థల్లో పర్యటించిన జీహెచ్ఎంసీ అధికారులు



ఐటీ ఉద్యోగులతో సమావేశమైన డీసీ రజనీకాంత్‌రెడ్డి, ఏఎంసీ నరేందర్‌రెడ్డి, ఇతర ఉద్యోగులు

రాయదుర్గం: జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ అధికారులు ఓటరు నమోదు ప్రక్రియపై మంగళవారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. గచ్చిబౌలి, నానక్‌రాంగూడలోని ఐటీ సంస్థల్లో అధికారులు, ఐటీ ఉద్యోగులతో సమావేశమై ఓటరు నమోదు, అడ్రస్, పేర్ల మార్పు వంటి అంశాలపైనే కాకుండా ఓటరు లిస్టులో పేరు ఉందా...? లేదా...? అనే అంశాన్ని పరిశీలించారు. జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి, ఏఎంసీ నరేందర్‌రెడ్డిల ఆధ్వర్యంలో సిబ్బంది గచ్చిబౌలిలోని డీఎల్ఎఫ్ భవనంలోని ఐటీ సంస్థలు, నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని అమెజాన్ ఐటీ సంస్థతోపాటు హనీ వెల్ సంస్థలో అక్కడి అధికారులతో కలిసి ఉద్యోగులకు అవగాహన కల్పించారు.

# 90శాతం అభివృద్ధి పనులు పూర్తి

కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్



డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ సమస్యలపై మంగళవారం స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పాదయాత్ర చేశారు. డివిజన్ పరిధిలోని జన్మభూమి కాలనీ, శివమ్మ కాలనీ, కమలమ్మ కాలనీ, మహవీర్‌నగర్, దత్తాత్రేయ కాలనీ, మహాత్మాగాంధీ నగర్, ఖాజానగర్‌లలో జీహెచ్‌యంసీ అధికారులు, స్థానికులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో అన్ని అభివృద్ధి పనులు 90శాతం ఇప్పటికే పూర్తి చేశామన్నారు. చిన్న చిన్న సమస్యలను కూడా త్వరగా పరిష్కరించి సమస్యలు లేని కాలనీ,బస్తీలుగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీఆర్‌యస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను, సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు దొడ్ల రామకృష్ణ గౌడ్, సమ్మారెడ్డి, కాశీనాద్‌యాదవ్, చిన్నోళ్ల శ్రీనివాస్, గుడ్ల శ్రీనివాస్, శివరాజ్‌గౌడ్, పాండుగౌడ్, బోయ కిషన్, దుర్గేష్, మధులత పాల్గొన్నారు.

### ఇష్టంతో చదవాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): విద్యార్థులు ఇష్టంతో చదివి మంచి ఫలితాలు సాధించాలని తెలంగాణ మోడల్ స్కూల్స్ అడిషనల్ డైరెక్టర్ రమణకుమార్ అన్నారు. మంగళవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల ప్రభుత్వ మోడల్ పాఠశాలను ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులతో ముచ్చటించారు. పలు విషయాలపై విద్యార్థులకు ప్రశ్నలు వేశారు. ఉపాధ్యాయుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని సాధనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### సీఆర్ ఫౌండేషన్ సేవలు భేష్...

హఫీజ్‌పేట్ : సీఆర్ ఫౌండేషన్ సేవలు భేష్ అని మాజీ ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ నాగేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన సీఆర్ ఫౌండేషన్‌లోని వృద్ధాశ్రమం, హెల్త్ సెంటర్, మహిళా శిక్షణ కేంద్రాన్ని ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ నారాయణతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టుల్లో అగ్ర నాయకుడు, తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్‌ను సందర్శించడం చాలా సంతోషంగా ఉందన్నారు. సమాజంలో ప్రజా పోరాటంలో పాల్గొన్న వారు, సాహితీ రంగాలలో విశేష సేవలు చేసిన వారందరు ఇక్కడ గడపడం ఆనందకరమన్నారు. కార్యక్రమంలో సీఆర్ ఫౌండేషన్ కోశాధికారి చెన్నకేశవులు పాల్గొన్నారు.

# ఇండియా ఈబీ–5 పెట్టుబడులపై ప్రత్యేక దృష్టి

- ఐఐయూఎస్ఏ అధ్యక్షుడు అరోన్‌గ్రా
- హైదరాబాద్ నాలెడ్జి సిటీలో 'ఇండియా ఈబీ–5 పాస్‌పోర్ట్ రోడ్డు షో సిరీస్'



ఐటీసీ కోహినూర్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఐఐయూఎస్ఏ అధ్యక్షుడు అరోన్‌గ్రా తదితరులు

రాయదుర్గం: ఐఐయూఎస్ఏ పాస్‌పోర్టు సిరీస్ ద్వారా అమెరికాలో పెట్టుబడులకు ప్రత్యేకించి ఈబీ–5 ఇమ్మిగ్రేంట్ ఇన్వెస్టర్ ప్రోగామ్ భారతీయ పెట్టుబడిదారులకు అండగా ఉంటుందని ఐఐయూఎస్ఏ అధ్యక్షుడు అరోన్‌గ్రా పేర్కొన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని ఐటీసీ కోహినూర్‌లో ఇన్వెస్ట్ ఇన్ యూఎస్ఏ(ఐఐయూఎస్ఏ), పీహెచ్‌డీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(పీహెచ్‌డీసీసీఐ) సంయుక్త ఆధ్వర్యంలో ఇండియా ఈబీ–5 పాస్‌పోర్ట్ రోడ్డు షో సిరీస్ కార్యక్రమాన్ని ఐఐయూఎస్ఏ డైరెక్టర్ ఆఫ్ ఈవెంట్స్, బిజినెస్ డెవలప్‌మెంట్ మెకెంజీ పెంటన్, పీహెచ్‌డీ సీసీఐ ఇంటర్నేషనల్ అఫైర్స్, ట్రేడ్ ఫెయిర్ డివిజన్ మయాంక్ చత్వాల్ మంగళవారం ప్రారంభించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇమ్మిగ్రేషన్ అవకాశాలపై పెరుగుతున్న ఆసక్తికి ఇది నిదర్శనమన్నారు. ఐఐయూఎస్ఏ పాస్‌పోర్ట్ సిరీస్ భారతీయ పెట్టుబడిదారుల మధ్య సంభాషణలు, కనెక్షన్లను సులభతరం చేయడానికి కృషి చేస్తున్నామన్నారు.

# సేవలోనే ఆనందం

**మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్**



శిబిరంలో మహిళలకు కళ్లద్దాలను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్ తదితరులు

హఫీజ్‌పేట్ : శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని అన్ని వర్గాలకు సందయ్య మెమోరియల్ ట్రస్టు సేవలు అందిస్తామని ట్రస్టు చైర్మన్, మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం కొండాపూర్ డివిజన్ పరిధిలోని ప్రేమ్‌నగర్ బి బ్లాక్ లో సందయ్య మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవారికి సేవ చేయడం ఆనందంగా ఉందన్నారు. ఉచిత కంటి పరీక్షల శిబిరాలను ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రస్టు కార్యదర్శి రవికుమార్ యాదవ్, నాయకులు రాధాకృష్ణ యాదవ్, గోపాలకృష్ణ, ఆంజనేయులు, రాజు, చంద్రశేఖర్, రహమతుల్లా, రామ్‌రెడ్డి, శంకర్, రంగన్న, నరసయ్య, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# ఉర్దూలో బహుభాషా పదకోశం అవసరం



రాయదుర్గం: ఉర్దూలో విభిన్న అంశాలకు సంబంధించిన బహుభాషా పదకోశం అవసరం...అలాంటి ప్రయత్నాలకు 'మనూ' ఎల్లప్పుడూ మద్దతు ఇస్తుందని ఉర్దూ విశ్వవిద్యాలయ వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో రాజనీతి శాస్త్రం యొక్క త్రిభాషా పదకోశం (ఇంగ్లిష్, ఉర్దూ, హిందీ) తయారీ కోసం కమిషన్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ టెక్నికల్ టెర్మినాలజీ(సీఎస్‌టీటీ) కేంద్ర విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఐదు రోజుల వర్క్‌షాప్ ప్రారంభ సెషన్‌లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌టీటీ చైర్మన్ ప్రొఫెసర్ గిరీష్‌నాథ్‌ఝా, ప్రొఫెసర్ ఇంతియాజ్ హుస్సేన్, షాజాద్ ఆలమ్ అన్సారీ, ప్రొఫెసర్ అఫ్రోజ్ ఆలమ్, డాక్టర్ ఖుర్షీద్ ఆలమ్ తదితరులు ప్రసంగించారు.

### కాశీ విశ్వేశ్వరుని కల్యాణోత్సవం

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్‌లోని అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ఈ మహోత్సవానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ హాజరయ్యారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గౌతమ్ గౌడ్, శ్రీనివాస్ యాదవ్, నరహరి, వెంకటేష్ గౌడ్, రామకృష్ణ, మల్లేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



### సీఐ జేమ్స్ బాబుకు ప్రశంసా పత్రం



గచ్చిబౌలి: లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారంలో ప్రత్యేక చొరవ తీసుకున్నందుకు గచ్చిబౌలి సీఐ జేమ్స్ బాబుకు సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర మంగళవారం ప్రశంసాపత్రం అందజేశారు. ఈ నెల 9న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించిన విషయం తెలిసిందే. కమిషనరేట్‌లో అత్యధిక కేసుల పరిష్కారానికి గచ్చిబౌలి పోలీసులు కృషి చేశారు.

# 30న ఉమాంగ్ 2.0 జువెలరీ, లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్





బ్రోచర్ విడుదల చేసిన నటి వర్ష తదితరులు, మోడల్స్ ర్యాంప్‌వాక్

మాదాపూర్: మాదాపూర్‌లోని హైటెక్స్‌లో జీటో ( జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్) ఆధ్వర్యంలో ఉమాంగ్ 2.0 జువెలరీ, లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయనున్నట్టు జీటో చైర్మన్ సుశీల్ సంచేటి తెలిపారు. మగువల అందాలను రెట్టింపు చేసే జువెలరీ అందుబాటులో ఉంటుందన్నారు. సెప్టెంబర్ 30 నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఎగ్జిబిషన్‌లో కవి సమ్మేళన్, లీడర్‌షిప్ తదితరాలను నిర్వహించనున్నట్టు తెలిపారు. మంగళవారం సికింద్రాబాద్‌లో నిర్వహించిన బ్రోచర్ రిలీజ్ కార్యక్రమంలో జబర్దస్త్ నటి వర్షతో పాటు పలువురు మోడల్స్ పాల్గొన్నారు. అనంతరం ర్యాంప్ వాక్ చేశారు. కార్యక్రమంలో జీటో చీఫ్ సెక్రటరీ పరేశ్‌షా, ట్రెజరర్ బి.ఎల్ బండారీ పాల్గొన్నారు.

## క్రైం కార్నర్

### సైబర్ వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

- ఏసీ రిపేరు కోసం గూగుల్లో వెతికిన ఉద్యోగి
- 2 లక్షల 96 వేలు పోగొట్టుకున్న బాధితుడు

పటాన్‌చెరు టౌన్: ఏసీ రిపేరు కోసం గూగుల్లో శోధించి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సైబర్ వలలో పడి రూ.2 లక్షల 96 వేలు పోగొట్టుకున్నాడు. పటాన్‌చెరు పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం ఇంద్రేశంకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సెప్టెంబర్ తొమ్మిదవ తేదీన ఏసీ రిపేరు చేయించేందుకు గూగుల్లో వెదికాడు.ఈ క్రమంలో ఓ ఫోన్ నంబర్ దొరకగానే కాల్ చేశాడు.దీంతో అపరిచిత వ్యక్తి చెప్పిన యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని అతనికి ఓటీపీలు చెబుతూ వచ్చాడు .ఈ క్రమంలో అతని ఖాతాలో ఉన్న రూ.2 లక్షల 96 వేలు మాయమయ్యాయి. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు అనంతరం మంగళవారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### గుర్తు తెలియని వ్యక్తి మృతి

మాదాపూర్: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. గుర్తు తెలియని వ్యక్తి (50) లక్కీ రెస్టారెంట్ వద్ద ఫుట్‌పాత్‌పై పడిపోయి ఉండడంతో స్థానికులు గమనించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

### నియామకం

మాదాపూర్: బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షులుగా కట్టా సత్యంచారిని, యువమోర్చ అధ్యక్షులుగా ఎర్రగుడ్ల శివ యాదవ్‌ని ఖానామెట్ కంటెస్టెడ్ కార్పొరేటర్ గంగుల రాధాకృష్ణయాదవ్ మంగళవారం నియమించారు. కార్యక్రమంలో మాదాపూర్ డివిజన్ అధ్యక్షుడు టీవీ మదనాచారి, రంగారెడ్డి అర్బన్ జిల్లా యువమోర్చ ప్రధాన కార్యదర్శి కైతాపురం జితేందర్, డివిజన్ బీజేపి ప్రధాన కార్యదర్శులు రాజేశ్వర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు ఆనంద్, బీజేవైఎం నాయకులు నరేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



### గ్రాండ్ పేరెంట్స్ డే



మియాపూర్ : మియాపూర్ మదీనాగూడలోని కెనరీ ద స్కూల్‌లో మంగళవారం గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో విద్యార్థుల తాత, నానమ్మలు ఉత్సాహంగా పాల్గొన్నారు.అదేవిధంగా వారి చిన్ననాటి జ్ఞాపకాలను విద్యార్థులకు తెలియజేశారు. ప్రిన్సిపాల్ లిడియా క్రిస్టినా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

# బీజేపీని గెలిపిస్తే మరింత అభివృద్ధి

పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్



శాంతినగర్‌లో ప్రచారం చేస్తున్న రవికుమార్ యాదవ్

హఫీజ్‌పేట్ : అక్రమార్కుల భరతం పట్టడానికి బీజేపీ అధికారంలోకి రావాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం చందానగర్ డివిజన్ పరిధిలోని శాంతినగర్, ఆదర్శనగర్ దుర్గా ఎస్టేట్‌లో గడపగడపకు రవన్న ప్రజాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతినగర్, ఆదర్శనగర్ కాలనీని అభివృద్ధి చేసింది భిక్షపతి యాదవ్ అని అన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ ప్రజాయాత్రలో నియోజకవర్గ కన్వీనర్ రాఘవేంద్రరావు, మాజీ కార్పొరేటర్ నవతారెడ్డి, కాలనీ అధ్యక్షులు సత్యనారాయణ, కనకదుర్గ, అజయ్‌కుమార్, రమేష్, శ్రీనివాస్, గణేష్, గౌతమ్, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.